సాక్షి
నాగర్‌కర్నూల్
బుధవారం। 30। ఏప్రిల్। 2025



.. ఆన్‌లైన్ సేవలు

ఉమామహేశ్వరం ఆలయంలో ఆన్‌లైన్ సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి.

వివరాలు IIలో ▸



రోడ్డెక్కిన అన్నదాతలు

వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలంటూ వనపర్తి జిల్లాలో రైతులు రోడ్డెక్కారు.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.1 /22.2

మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీయడంతో పాటు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

నాగర్‌కర్నూల్ క్రైం: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధి, సమస్యలు తదితర వాటిపై ప్రజలు, ప్రయాణికులు సెల్ **నం.73824 46772కు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.**

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలు

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామం ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో మంగళవారం 6వ తరగతి విద్యార్థులను చేర్చుకున్నట్లు ప్రిన్సిపల్ పర్దీప్‌కుమార్ తెలిపారు. గతంలో ఏకలవ్య ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు సంబంధించి ఫలితాలు వెలువడగా.. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాలలో అడ్మిషన్ చేసుకుంటున్నట్లు వివరించారు. మంగళవారం నుంచి వచ్చే నెల 9 వరకు మొదటి ఫేజ్ కింద పాఠశాలలో చేర్చుకుంటామని, అర్హత సాధించిన విద్యార్థులు సకాలంలో వచ్చి పాఠశాలలో చేరాలని ఆయన కోరారు.

వేసవి క్రీడా శిక్షణ ఉచిత శిబిరాలు

కందనూలు: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులచే ఉచిత వేసవి క్రీడ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ సీతారాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 14 ఏళ్లలోపు బాలబాలికలు ఉచిత వేసవి క్రీడా శిబిరాలలో చేరేందుకు వచ్చే నెల 1 నుంచి 6 వరకు తమ పేరును www.satgasc.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

బాలికలకు కరాటే శిక్షణ

జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మే 1 నుంచి 31 వరకు బాలికలకు ఉచిత కరాటే శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కరాటే మాస్టర్ స్వాతి తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని, 8- 45 ఏళ్లలోపు మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు.

లింగాలలో కబడ్డీ కోచింగ్..

లింగాల: డీవైఎస్‌ఓ ఆధ్వర్యంలో మే 1 నుంచి 30 వరకు లింగాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కబడ్డీ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కోచ్ ఎండీ అబ్దుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు, ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు.

లాటరీ పద్ధతిలో మద్యం బార్‌ల కేటాయింపు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని అచ్చంపేట మున్సిపాలిటీలో రెండు మద్యం బార్లను లాటరీ పద్ధతిలో అదనపు కలెక్టర్ దేవసహాయం ఆధ్వర్యంలో కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 18 మంది దరఖాస్తుల సమక్షంలో లాటరీ పద్ధతిన 2 మద్యం బార్లను కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఇందులో అప్లికేషన్ నం.10 వనపర్తికి చెందిన రాజేష్, అప్లికేషన్ నం.18 రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన ఆనంద్ లాటరీ పద్ధతిలో ఎంపికయ్యారని వివరించారు.

ఇద్దరి మధ్య ఆధిపత్య పోరే కారణమా?

మల్లమ్మకుంట రిజర్వాయర్ రద్దు చేయాలని ఎంపీ లేఖ రాయడం అలంపూర్ రైతులతో పాటు కాంగ్రెస్ శ్రేణులను ఆవేదనకు గురిచేస్తోంది. స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు దీన్ని వ్యతిరేకించడంతో పాటు భిన్నస్వరాలు వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి, ప్రస్తుత ఎంపీ మధ్య పొసగడం లేదనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఒకరు నిర్మించాలని.. ఒకరు వద్దని ఇదివరకే పట్టుబట్టారని.. వారిద్దరి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోందని ప్రచారం జరుగుతోంది. ఆయా నేతల మధ్య సమన్వయ లోపం తమకు శాపంగా మారిందని రైతులు వాపోతున్నారు.

‘చిన్నోనిపల్లి’ లింక్‌కు నో..

ఈ వివాదం నడుస్తున్న క్రమంలో ఆర్డీఎస్ కెనాల్‌కు చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు లింక్ చేసే ప్రతిపాదనలను ఎంపీ తెరపైకి తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కృష్ణానీటిపై ఆధారపడి గట్టు మండలంలో చిన్నోనిపల్లి రిజర్వాయర్ తెరపైకి వచ్చింది. తుంగభద్ర నీటి ఆధారంగా వడ్డేపల్లి మండలం తనగల సమీపంలో మల్లమ్మకుంట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తుంగభద్ర నదికి వరదలు వచ్చినప్పుడే కాకుండా వర్షపు నీటితో కూడా ఆధారపడి నిర్మించే ఈ రిజర్వాయర్‌లో నీరు నిల్వ చేసుకుంటే తమకు ప్రయోజనం ఉంటుందని అలంపూర్ నియోజకవర్గానికి చెందిన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర నదిలో నీరు లేని సమయంలోనూ ఆర్డీఎస్ కెనాల్ ద్వారా వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్,రాజోళి మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందే అవకాశం ఉంటుందని.. చిన్నోనిపల్లి ద్వారా ఇది సాధ్యం కాదని.. తాము ఒప్పుకునేది లేదని చెబుతున్నారు.

‘మల్లమ్మకుంట’పై నీలినీడలు..!

రాజోళిబండ డైవర్షన్ స్కీం (ఆర్డీఎస్).. దశాబ్దాల కాలంగా నీటి వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచిన అంతర్రాష్ట్ర ప్రాజెక్ట్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ, కర్ణాటక మధ్య నీటి వాటాల స్థిరీకరణతోపాటు తెలంగాణ ప్రాంతానికి నీటి కేటాయింపుల్లో వివక్షపై జగడాలు కొనసాగాయి. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఇదే కీలకాంశంగా మారగా.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సైతం మునుపటి పరిస్థితులే నెలకొన్నాయి. ప్రస్తుతం మూడు రాష్ట్రాల సమస్యగా మారింది. ఇది ఒకవైపు కాగా.. మరోవైపు తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా వెనుకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని ఆర్డీఎస్ ఆయకట్టును పూర్తిస్థాయిలో సస్యశ్యామలం చేయాలనే లక్ష్యం మాటలకే పరిమితమైంది. ఈ ఎత్తిపోతల్లో భాగంగా నిర్మించాల్సిన రిజర్వాయర్లపై ఏళ్ల తరబడి సందిగ్ధత వీడకపోవడం.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త ప్రతిపాదనలు తెరపైకి రావడం వంటి కారణాలు అనిశ్చితికి కారణమవుతున్నాయి. సరైన ప్రణాళిక లేమి.. రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం వెరసి మల్లమ్మకుంట రిజర్వాయర్‌పై నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్ట్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్



మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రదేశం

గ్రౌండ్ రిపోర్ట్

రిజర్వాయర్ నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు

- కలెక్టర్‌కు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి లేఖతో దుమారం
- అలంపూర్ పరిధిలోని ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- చిన్నోనిపల్లి, ఆర్డీఎస్‌కు లింక్ అంటూ తెరపైకి కొత్త ప్రతిపాదనలు
- వ్యతిరేకిస్తున్న అన్నదాతలు.. కాంగ్రెస్‌లో భిన్నస్వరాలు

పేరుకే 87,500 ఎకరాలు..

నిజాం కాలంలో కర్ణాటక పరిధిలోని రాజోళిబండ సమీపంలో తుంగభద్రపై ఆనకట్ట నిర్మించిన విషయం తెలిసిందే. తెలంగాణకు సంబంధించి నడిగడ్డ ప్రాంతంలో 87,500 ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో ఆనకట్ట ఎడమవైపున 143 కిలోమీటర్ల కాల్వ (ఆర్డీఎస్ కెనాల్) నిర్మాణం పూర్తి చేశారు. అయితే 20 ఏళ్లుగా ఏనాడూ పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరందలేదు. పంటలు సాగుచేయడం.. నీరందక అవి ఎండిపోవడం.. రైతులు నష్టాల పాలవడం పరిపాటిగా మారింది. కనీసం 30 వేల ఎకరాలకు నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ఆర్డీఎస్ ఆయకట్టును పూర్తి స్థాయిలో సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని అప్పటి ప్రభుత్వం 2017లో తుమ్మిళ్ల లిఫ్ట్‌తో పాటు ఇటిక్యాల మండలం వల్లూరు, వడ్డేపల్లి మండలం జూలకల్, తనగల వద్ద మల్లమ్మకుంట వద్ద మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి సంబంధించిన ఫేస్-1, 2 పనులకు జీఓ 429 జారీ చేసింది. 9.6 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణం చేపట్టి.. తనగల సమీపంలోని డిస్ట్రిబ్యూటరీ 23 వద్ద డెలివరీ సిస్టమ్ ద్వారా తుంగభద్రలోని నీటిని తోడి ఆర్డీఎస్ కెనాల్‌కు మళ్లించేందుకు శ్రీకారం చుట్టింది. ఏడాదిలోపే తుమ్మిళ్ల లిఫ్ట్‌ను రూ.190 కోట్లతో ఏర్పాటు చేసి.. కెనాల్‌కు నీటిని పంపింగ్ చేశారు. కానీ రిజర్వాయర్ల నిర్మాణం అటకెక్కింది.

రిజర్వాయర్‌కు గ్రీన్‌సిగ్నల్.. అంతలోనే..

రిజర్వాయర్లు నిర్మిస్తే తప్ప పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు మొరపెట్టుకున్నారు. స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రిజర్వాయర్లలో రూ.520 కోట్ల వ్యయంతో 1.2 టీఎంసీల సామర్థ్యంతో మల్లమ్మకుంట నిర్మాణానికి మాత్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తుమ్మిళ్ల లిఫ్ట్‌లో కీలకమైన ఈ రిజర్వాయర్ నిర్మాణానికి అధికారులు చేపట్టిన భూసర్వేకు అడుగడుగునా అడ్డంకులు ఎదురయ్యాయి. మొత్తం 567 ఎకరాలు అవసరమని అధికారులు నివేదికలు రూపొందించారు. పెగ్ మార్కింగ్ పనులు నిర్వహిస్తున్న క్రమంలో రైతులు అడ్డుకున్నారు. పూర్తి నష్టపరిహారం ఇచ్చి.. న్యాయం చేశాకే పనులు మొదలుపెట్టాలని ఆందోళనలకు దిగారు.

■ ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి కలెక్టర్‌కు లేఖ రాయడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం వల్ల 250 మంది దళిత రైతులు భూములు కోల్పోతారని.. దాన్ని రద్దు చేయాలని ఆయన గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్‌కు లేఖ రాయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చినట్లయింది. ఈ మేరకు ఆయన నీటిపారుదల శాఖ ఎస్‌ఈకి లేఖ రాయడం.. ఆ అధికారి పైఅధికారికి నివేదికలు సమర్పించడం.. కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడం హాట్‌టాపిక్‌గా మారింది. మల్లమ్మకుంట రిజర్వాయర్‌పై నీలినీడలు కమ్ముకోగా.. ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



మల్లమ్మకుంట రిజర్వాయర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ (ఫైల్)

మల్లమ్మకుంట తోనే మేలు..



తుమ్మిళ్ల లిఫ్ట్ నిర్మాణం వల్ల చాలా వరకు నీటి సమస్య తీరింది. తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం ఉన్నప్పుడే తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా నీటిని తోడుకునేందుకు అవకాశం ఉంటుంది. నదిలో నీరు లేని సమయంలో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మిస్తే వరద ఉన్నప్పుడు రిజర్వాయర్‌లో నీరు నింపుకోవచ్చు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మిస్తేనే మేలు. వేలాది మంది రైతులకు న్యాయం జరుగుతుంది.

– వీరన్న, ఆయకట్టు రైతు, తనగల

రిజర్వాయర్ రద్దు మంచిది కాదు..



మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మిస్తే అలంపూర్ నియోజకవర్గంలోని 55 వేల ఎకరాల ఆయకట్టుకు, పదివేల ఎకరాల నాన్‌ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరందుతుంది. అలంపూర్ సస్యశ్యామలమవుతుంది. దీన్ని రద్దు చేయడం వల్ల కేవలం 400 ఎకరాల రైతులకు మాత్రమే మేలు జరుగుతుంది. మల్లమ్మకుంట రిజర్వాయర్ రద్దు మంచిది కాదు. నష్టపోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలి. సాటి రైతులు కూడా అడ్డుకునే పరిస్థితి ఉండదు.

– సీతారామిరెడ్డి, ఆర్డీఎస్ మాజీ చైర్మన్,

ఈతకు వెతలు



కొల్లాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణం

జిల్లాలో కాల్వలు, బావులను ఆశ్రయిస్తున్న చిన్నారులు

- ఏటా ప్రమాదాల బారినపడుతున్న వైనం
- కొల్లాపూర్‌లో దశాబ్దకాలంగా అసంపూర్తిగానే పనులు
- క్రీడా శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్స్ నిర్మించాలని వేడుకోలు

కొల్లాపూర్: పట్టణానికి చెందిన ఓ విద్యార్థి(13) ఈత కోసం ఖాదర్‌పాష దర్గా సమీపంలోని బావికి వెళ్లాడు. పైనుంచి బావిలో దూకగా.. అందులో తలకు రాయి తగిలగా తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. జిల్లాలో ప్రతి సంవత్సరం వేసవిలో ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదభరితంగా ఉండే బావులు, కాల్వలు, చెరువుల్లోకి ఈత కోసం వెళ్లి పిల్లలు మృత్యువాత పడుతున్నారు. ఈ ప్రమాదాలు అరికట్టేందుకు, ఈత నేర్చుకునే వారికి ఉపయోగకరంగా ఉండేందుకు ప్రభుత్వం స్విమ్మింగ్ పూల్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

వేసవి సెలవుల నేపథ్యంలో..

ప్రస్తుతం విద్యాసంస్థలకు వేసవి సెలవులు ప్రకటించారు. సెలవుల్లో చాలామంది చిన్నారులు ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతారు. అయితే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కడ కూడా ప్రభుత్వ పరిధిలోని పబ్లిక్ స్విమ్మింగ్ పూల్స్ లేవు. దీంతో ఈత నేర్చుకునే వారు కాల్వలు, బావులను ఆశ్రయిస్తున్నారు. లోతు ఎక్కువగా ఉండటం, జమ్ము, ముళ్లకంపలు కాళ్లకు చుట్టుకోవడం వంటి కారణాలతో ఈత నేర్చుకునేందుకు వెళ్లే చిన్నారులు ప్రమాదాల బారినపడుతున్నారు. క్రీడా శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేస్తే చిన్నారులు ఈత నేర్చుకోవడంతోపాటు ఈత పట్ల ఆసక్తి ఉన్న యువత, వాకర్లకు దేహదారుఢ్య పెంచుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

కొల్లాపూర్‌లో అసంపూర్తిగా పనులు

కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో 2017లో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు యువజన, క్రీడాశాఖ ద్వారా రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేసి.. మినీస్టేడియం నిర్మించిన కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించారు. అయితే పనుల పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీరాజ్ శాఖ అధికారులకు కట్టబెట్టారు. ఆరు నెలల్లో పనులు పూర్తిచేయాలని అప్పట్లో జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. అయితే నిధుల లేమి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు కూడా స్విమ్మింగ్ పూల్ విషయాన్ని పట్టించుకోవడం మానేశారు. ఈ ఏడాది స్విమ్మింగ్ పూల్ నిర్మాణం పూర్తవుతుందనే ప్రచారం జరిగింది. కానీ, ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు.

ఉపయోగకరంగా ఉంటాయి..



జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలతోపాటు మండల కేంద్రాల్లో కూడా పబ్లిక్ స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేయాలి. చిన్నపిల్లలు ఈత నేర్చుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. బావులు, కాల్వల వద్దకు వెళ్లి పిల్లలు మృత్యువాత పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు స్విమ్మింగ్‌పూల్స్ ఏర్పాటే పరిష్కార మార్గం. మార్నింగ్ వాకర్లు, యువతకు కూడా స్విమ్మింగ్‌పూల్స్ ఉపయోగపడతాయి. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– సత్యనారాయణగౌడ్, కొల్లాపూర్

పనులను పరిశీలిస్తాం..



కొల్లాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. పాత కాంట్రాక్టర్‌కే మళ్లీ పనుల పూర్తి బాధ్యత అప్పగించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ విషయమై చర్చించి.. పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల పురోగతిని పరిశీలిస్తాం. జిల్లాలో కొత్తగా పబ్లిక్ స్విమ్మింగ్ పూల్స్ నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాదనలు లేవు.

– సీతారాం, డీవైఎస్‌ఓ

ఉగ్రవాదాన్ని నిర్మూలించి దేశ ఐక్యత చాటాలి

కందనూలు: ఉగ్రవాదాన్ని నిర్మూలించి దేశ ఐక్యతను చాటాలని కవులు, రచయితలు తమ కవితల ద్వారా నిరసన గళాన్ని వినిపించారు. జమ్ముకాశ్మీర్‌లోని పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రముఖ కవి గుడిపల్లి నిరంజన్ అధ్యక్షతన ‘ఉగ్రవాదం నశించాలని’ అంశంపై కవులు, రచయితలు తమ కవితలు చదివారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించి, దేశ ఐక్యత చాటాలని, అన్ని మతాల మధ్య మతసామరస్యం పెంపొందించాలని ఆకాంక్షించారు. అలాగే మతాల మధ్య విద్వేషం కాకుండా సామరస్య పూరిత వాతావరణం నెలకొనాలని, లౌకిక ప్రజాస్వామ్య భారత రాజ్యాంగ విలువలు ప్రతి పౌరుడు పాటించాలని కవులు తమ కవితల ద్వారా పాటల రూపంలో తెలియజేశారు. సరిహద్దులో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి ఇలాంటి తీవ్రవాద చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో కవులు, రచయితలు ముచ్చర్ల దినకర్, ఎదిరేపల్లి కాశన్న, కందికొండ మోహన్, కొంగరి జానయ్య, సోమశిల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కవులు, రచయితలు

పకడ్బందీగా పారిశుధ్య పనుల నిర్వహణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్: భూగర్భ జలాలు పెంపొందించడానికి, ఇంకుడు గుంతల నిర్మాణం అత్యంత ఆవశ్యకమైందని, నీటి అవసరాలను తీర్చడమే కాకుండా భవిష్యత్ తరాలకు నీటిని అందించడానికి నీటి కొరతను నివారించడానికి ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆఖరునాటికి అన్ని గ్రామాలు ఓడీఎఫ్ ప్లస్ మోడల్‌గా మార్చాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని, మురుగు నిల్వ ఉండే చోటు గుర్తించి ఇంకుడు గుంతలు నిర్మించాలని, గ్రామాల్లో శుభ్రత పాటించాలని పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని చెప్పారు. గ్రామీణ ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. జిల్లా, గ్రామీణ నీటి పారుదల, పారిశుద్ధ్య మిషన్ కమిటీ ప్రతినెల సమావేశాలు ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నిధులకు ఎలాంటి కొరత లేదని అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు, డీపీఓ రాంమోహన్‌రావు, డీఈఓ రమేష్ కుమార్, డీఏఓ చంద్రశేఖర్, డీడబ్ల్యూ ఓ రాజేశ్వరి, డీటీడబ్ల్యూఓ ఫిరంగి పాల్గొన్నారు.

స.హ.చట్టంపై అవగాహన

సమాచార హక్కు చట్టం, గ్రామసభ నిర్మాణ సామర్థ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు దేవసహాయం అన్నారు. సహచట్టం, గ్రామసభ నిర్మాణ సామర్థ్యంపై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాలను అభివృద్ధిపరచడంలో పంచాయతీ కార్యదర్శులు ముఖ్య పాత్ర పోషిస్తారని, కాబట్టి వీరంతా ఆయా అంశాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. సహచట్టం, గ్రామసభల నిర్మాణ సామర్థ్యంపై ఏడాది పొడవునా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఓ రామ్మోహన్‌రావు, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ హన్మంతు, రీసోర్స్‌పర్సన్స్ కృష్ణ, కోటేశ్వరరావు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం కష్టాలు తీరేనా!

- ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పాం కోతలు ప్రారంభం
- పంట విక్రయానికి అశ్వారావుపేటకు వెళ్లాల్సిందే..
- స్థానికంగా ప్రాసెసింగ్ పరిశ్రమలు ఉంటేనే రైతులకు ప్రయోజనం



కృష్ణా మండలంలో ఆయిల్‌పాం గెలలను తెంచుతున్న రైతులు

నర్వ: దేశంలో నూనె గింజల ఉత్పత్తి తగ్గడం.. నూనెల వినియోగం గణనీయంగా పెరగడం వంటి కారణాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తున్నాయి. డిమాండ్ మేర నూనె గింజల ఉత్పత్తే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు అనువైన నేలలు ఉండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రారంభంలో కాస్త వెనకబడినా.. ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలతో ప్రతి ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అయితే ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పాం పరిశ్రమ లేకపోవడంతో రైతులు పంటను విక్రయించేందుకు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు.

– 2020-21 సంవత్సరం ప్రారంభంలో ఉమ్మడి జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా.. 430 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పాం సాగుకు శ్రీకారం చుట్టగా.. అధికారులు 4,60,000 మొక్కలను దిగుమతి చేసుకున్నారు. అప్పటి నుంచి క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 28,999 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పాం పరిశ్రమ అందుబాటులో లేకపోవడంతో రైతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు ఆయిల్‌పాం గెలలను తరలించాల్సి వస్తోంది.

పరిశ్రమలు ఉంటేనే ప్రయోజనం..

పంట కోతలు ప్రారంభమైన నేపథ్యంలో కత్తిరించిన గెలలను గంటల వ్యవధిలోనే పరిశ్రమలో ప్రాసెసింగ్ చేస్తే ఎక్కువ స్థాయిలో నూనె వస్తుంది. జిల్లాలో తెంపిన గెలలను అశ్వారావుపేటకు తీసుకెళ్లేందుకు కనీసం ఒక రోజు సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో స్థానికంగానే పరిశ్రమలు అందుబాటులో ఉంటే ప్రయోజనం కలుగుతోందని రైతులు అంటున్నారు. కాగా.. ఇటీవల నారాయణపేట జిల్లాలో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పర్యటించి.. రూ. 300 కోట్లతో ఆయిల్‌పాం పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పరిశ్రమ ఏర్పాటుపై జాప్యం చేయవద్దని రైతులు కోరుతున్నారు.

త్వరలో ఇబ్బందులు తీరుతాయి..

ఆయిల్‌ఫెడ్ జీఎం అందించిన సమాచారం మేరకు జోగుళాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి వద్ద 95 ఎకరాల్లో, వనపర్తి జిల్లా సంకిరెడ్డిపల్లిలో 40 ఎకరాల్లో ఆయిల్‌పాం పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం చిత్తనూర్ వద్ద 80 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటుకు స్థలం సేకరణలో దాదాపు కొలిక్కి వచ్చింది. మరో కొన్ని నెలల్లో రైతులు స్థానికంగానే పంటను విక్రయించవచ్చు.

– సమీనా బేగం, ఆయిల్‌ఫెడ్ ఇన్‌చార్జి, నారాయణపేట

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని వల్లూరుకు చెందిన మొండి ఎల్లప్ప (42) చేపల వేటకు వెళ్లి మృతిచెందాడని సీఐ కమలాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఎల్లప్ప సోమవారం ఉదండాపూర్ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వేసిన వల కాళ్లకు చుట్టుకొని మునిగిపోయాడు. మంగళవారం నీటిపై మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు గుర్తించి బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

'సమస్య పరిష్కరించకుంటే.. చావే'


బాధిత రైతు నర్సింహులు

నవాబుపేట: 'తమ భూమి ఉదండాపూర్ రిజర్వాయర్‌లో మునుగుతుందని అధికారులు సర్వే చేసి భూమిని తీసుకున్నారు. తీరా కట్ట పనులు సాగుతుండగా.. మా భూమి ప్రాజెక్టులో మునగడం లేదు. దీంతో ఈ విషయాన్ని సర్వే ద్వారా రుజువు చూయించి.. భూమిని సాగు చేసుకునేలా అవకాశం ఇవ్వాలని, లేకపోతే 24 గంటల్లో ఆత్మహత్య చేసుకుంటానని' ఓ రైతు వీడియో సందేశంలో పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని కారుకొండ గ్రామ రైతు నర్సింహులుకు సర్వే నం.116(బీ)లో 3.32 ఎకరాల భూమి ఉంది. దీన్ని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో మునుగుతుందని చెప్పి పరిహారం సైతం ఇచ్చారు. అయితే కట్ట నిర్మాణం సాగుతుండగా.. నర్సింహులు భూమి ప్రాజెక్టు పరిధిలోకి రాకపోవడంతో నాటి నుంచి బీడుగా మారింది. దీంతో తమ భూమి ప్రాజెక్టులో మునగడం లేదని, ఈ భూమిని తమకు తిరిగి ఇవ్వాలని రైతు కోరుతున్నాడు. ఈ విషయమై అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో మంగళవారం తనకు న్యాయం చేయాలని కోరుతూ సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో గ్రామస్తులు అతనికి సర్దిచెప్పి ఎమ్మెల్యేతో మాట్లాడించి సమస్యను పరిష్కరించేలా చేస్తానని హామీ ఇప్పించారు.

పీయూలో అధ్యాపకుల వంటావార్పు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంగళవారం పీయూ ముఖద్వారం వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శేకుంటి రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా యూనివర్సిటీలో పని చేస్తున్న అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని, ప్రారంభం నుంచి యూనివర్సిటీనే నమ్ముకునే విధులు నిర్వహిస్తున్నామన్నారు. రీసెర్చ్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సెమినార్‌లో కన్వీనర్లుగా వ్యవహరించిన అనుభవం ఉందన్నారు. ఉద్యోగాల్లో ఎలాంటి భద్రతా భావం లేకుండా జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సురేష్, ప్రదీప్, /జ్ఞానేశ్వర్, కిషోర్, గౌస్, సోమేష్, శ్రీనివాసులు, విజయ్‌భాస్కర్, గురుస్వామి, స్వాతి, సుస్మిత పాల్గొన్నారు.

'ఉమామహేశ్వరం'లో
ఆన్‌లైన్ సేవలు


ఉమామహేశ్వర దేవాలయం

- ప్రముఖ ఆలయాల మాదిరిగానే..
- ముందస్తు బుకింగ్‌తో భక్తులకు ప్రయోజనం
- ప్రారంభించిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ


ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో సేవలను భక్తులకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆలయాల్లో నిర్వహించే ముఖ్యమైన సేవలను భక్తులు ముందస్తుగా బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆలయాల్లో భక్తుల రద్దీ, క్యూలైన్లను తగ్గించేందుకు ఈ మేరకు చర్యలు చేపట్టింది. గతంలో ఆలయాల్లో అభిషేకాలు, ఆర్జిత సేవలు, అన్నదానం, వసతి సౌకర్యం కోసం ఆలయాలకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉండేది. ఇక నుంచి ఆలయాల్లోని సేవలన్నీ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు భక్తులకు వీలు కల్పించింది.

ఉమామహేశ్వరంలోనూ అందుబాటులోకి..

శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర దేవాలయంలో శివుడిని దర్శించుకోవడానికి, ప్రకృతి రమణీయ ప్రదేశాన్ని చూడటానికి వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ ఆలయంలోనూ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయశాఖ నుంచి అనుమతి రావడంతో సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారు.

విరాళాలు ఇవ్వొచ్చు..



ఉమామహేశ్వర దేవాలయానికి వివిధ ప్రాంతాల నుండి నిత్యం భక్తులు వస్తుంటారు. కానుకలు, విరాళాలు ఆన్‌లైన్‌లో ఇవ్వొచ్చు. విదేశాలలో ఉన్న భక్తులు కూడా ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. భక్తులకు సౌకర్యార్థంగా ఉంటుంది.

– శ్రీనివాసరావు, ఈఓ

ఎమ్మెల్యే కృషితోనే..



రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల మాదిరిగా ఉమామహేశ్వరంలోనూ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ కృషితోనే ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది.

– బీరం మాధవరెడ్డి, చైర్మన్, ఆలయ కమిటీ

అర్చన నుంచి అన్నదానం వరకు..

స్మార్ట్‌ఫోన్‌లో టీ యాప్‌తో పాటు ఆన్‌లైన్ కేంద్రాలు, మీసేవా కేంద్రాల్లో దేవాలయంలో కావాల్సిన సేవలను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. ఆర్జిత సేవలు, అభిషేకాలు, అర్చన, కల్యాణం, అన్నదానంతో పాటు దేవుడి ప్రసాదం, వాహన పూజ తదితర 23 రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

నిలిచిన సహాయక చర్యలు

- 66 రోజుల తర్వాత ఎస్‌ఎల్‌బీసీకి విరామం
- ఇప్పటికీ దొరకని ఆరుగురి ఆచూకీ


సొరంగం బయటకు తెచ్చిన ఎస్కవేటర్

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం లోపల సహాయక చర్యలు నిలిచిపోయాయి. మొదట్లో 12 బృందాలకు చెందిన 800 మంది సిబ్బంది తవ్వకాల్లో పాల్గొనగా మంగళవారం హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు చెందిన 55 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. కానీ వీరు కూడా సహాయక చర్యల్లో పాల్గొనలేదు. నిషేధిత 43 మీటర్ల ప్రదేశంలో సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బంది నిరాకరించడంతో తాత్కాలికంగా పనులు నిలిపి వేశారు. సాంకేతిక కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పనులు చేపట్టాలా.. వద్దా అనే నిర్ణయం ప్రభుత్వం తీసుకోనుంది. ప్రమాద ప్రదేశం సొరంగం లోపల నుంచి ఎస్కవేటర్లు, జెట్ మోటార్లు, ఇతర మిషన్లు, మెకానిక్ సామగ్రిని సొరంగం బయటకు తరలించారు.

ఆరుగురి జాడ కోసం..

సొరంగం లోపల పైకప్పు కూలిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా సహాయక సిబ్బంది ఇద్దరు కార్మికుల మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన ఆరుగురి కోసం 66 రోజులుగా శ్రమించినా జాడ లభించలేదు. నిషేధిత ప్రదేశంలోని టీబీఎం క్యాబిన్‌లో ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. సొరంగం పైకప్పు కూలిన 43 మీటర్ల ప్రదేశాన్ని అత్యంత ప్రమాద ప్రాంతంగా గుర్తించారు. ఈ ప్రదేశంలో మాత్రమే పనులు చేయాల్సి ఉంది. నిషేధిత ప్రదేశంలో పేరుకుపోయిన మట్టి, బురద, బండరాళ్లు కదిలిస్తే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని జీఎస్‌ఐ అధికారులు నిర్ధారించడంతో అక్కడ పనులు నిలిపివేశారు. జాగ్రత్తగా పనులు చేసే అవకాశం ఉందని భావించి డీ1 నిషేధిత ప్రదేశంలో రెండురోజుల పాటు 10 మీటర్ల వరకు సహాయక చర్యలు కొనసాగించారు. ఒక వైపు పైభాగంలో ఉన్న సెగ్మెంట్ బ్లాక్‌ల లిఫ్టింగ్ క్రేన్ ప్లాట్‌ఫాంను పూర్తిగా తొలగించారు. టీబీఎం మిషన్ ప్లాట్‌ఫాం కొంతభాగం కట్ చేయాల్సిన పనులు మిగిలిపోయాయి. ఈ పనులు చేపడుతున్న క్రమంలో సాంకేతిక కమిటీ సూచనల మేరకు మంగళవారం నుంచి సహాయక చర్యలు పూర్తిగా నిలిచిపోయాయి.

నివేదిక ఆధారంగానే

సాంకేతిక కమిటీ నియమించిన సబ్‌కమిటీ సొరంగం లోపల అధ్యయనం చేసిన తర్వాతే పనులు చేయాలా వద్దా అనే నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. 13.936 కిలోమీటర్ వద్ద సొరంగం పైకప్పు కూలడం, అక్కడి నుంచి ఉబికి వస్తున్న నీటి ఊటను అరికట్టేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయనున్నారు. ప్రమాద ప్రదేశం నుంచి ముందుకు వెళ్లడం సాధ్యం కాకపోతే డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టిరింగ్ విధానం అనుసరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. ఇందుకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతి రావాల్సి ఉంటుంది. ఈ తతంగం జరిగేందుకు సుమారు మూడు నెలల సమయం పట్టొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

కర్ణాటక నుంచి వస్తున్న వరి ధాన్యం లారీల పట్టివేత



నారాయణపేట: కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న వరి ధాన్యం లారీలను తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని నారాయణపేట మండలం జలాల్‌పూర్ చెక్‌పోస్టు దగ్గర పోలీసులు పట్టుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పజెప్పారు. డీఎస్‌ఓ బాలరాజు కథనం మేరకు.. సోమవారం సాయంత్రం కర్ణాటకలోని సోరాపూర్ నుంచి హైదరాబాద్, మిర్యాలగూడకు వరి ధాన్యం తీసుకెళ్తున్న లారీలను చెక్‌పోస్టు దగ్గర పోలీసులు చెక్‌చేయగా వే బిల్స్, ధాన్యం కొనుగోలు బిల్లులు లేకపోవడంతో వాటిని తమకు అప్పజెప్పడంతో పంచనామా చేసినట్లు చెప్పారు. టీఎస్ 07 యుఈ 5256 లారీలో 550 బస్తాలు, టీఎస్ 30 టీఏ 1439 లారీలో 500 బస్తాలు, టీఎస్ 05 యడి 1579 లారీలో 500 బస్తాలు, టీఎస్ 05 యుసీ 6996 లారీలో 550 బస్తాలు, టీజీ 05 టీ 6566 లారీలో 442 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. మరో లారీని మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. ఆ లారీలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి బుధవారం పంచనామా చేస్తున్నట్లు వివరించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఎవరూ వరి ధాన్యం తీసుకు వచ్చినా కేసులు తప్పవని హెచ్చరించారు. జిల్లా అడిషనల్ (రెవెన్యూ) బెన్‌షాలం ఆదేశాల మేరకు ఆ లారీ యాజమానులపై 6 (ఏ) కేసు నమోదు చేశారు. పంచనామా నిర్వహించిన వారిలో డీటీలు కాశప్ప, నాగరాజు, ఆనంద్, గురురాజు ఉన్నారు.

2న జోగుళాంబ ఆలయ భూముల కౌలు వేలం


అలంపూర్ ఆలయాల సముదాయం

అలంపూర్: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో వచ్చే నెల 2న ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించనున్నట్లు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఆలయాల భూముల వేలం నిర్వహించగా.. పలు సర్వే నంబర్లలో భూములకు సరైన కౌలు ధర పలకపోవడంతో నిలిపివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండోసారి మిగిలిన సర్వే నంబర్లలోని భూమి కౌలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తక్కశీల గ్రామంలోని సర్వే నం.253లో 4.04 ఎకరాల భూమి మాదక్క పట్టెలు అనే పొలం ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే అలంపూర్ శివారులోని సర్వే నం. 566లో 9.28 ఎకరాలు కుమ్మరి గుట్టల పొలం, సర్వే నం.960లోని 9.04 ఎకరాల తంగడి మాను చేను, భైరంపల్లిలోని సర్వే నం.11లోని 11.13 ఎకరాలు ఈదుల గడ్డ పొలం, చందాపూర్‌లోని సర్వే నం.20లోని 7.08 ఎకరాలకు వేలం పాట వేస్తామన్నారు. అలాగే ఏపీలోని కర్నూలు జిల్లా కల్లూరులోని సర్వే నం.346/1, 346/3లోని 15.18 ఎకరాలు పెరుగువాని చేను కౌలు ఉన్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే రైతులు రూ.50 వేలు డిపాజిట్ ఆలయ ఈఓ పేరు మీద డీడీ తీయాలని, తమ ఆధార్ కార్డుతోపాటు ఏదైనా బ్యాంకు ఖాతాలకు సంబంధించిన రెండు చెక్కులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. పాత బకాయిలు ఉన్న రైతులు, ఇతర బకాయిలు ఉన్న రైతులు వేలంలో పాల్గొనడానికి అనర్హులన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 94404 54656, 88867 61196లను సంప్రదించాలని సూచించారు.

మిషన్ భగీరథ ప్లాంట్‌ను పరిశీలించిన ఈఎన్సీ


వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం దోమలపెంటలోని మిషన్ భగీరథ 3 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మంగళవారం మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి పరిశీలించారు. కృష్ణా తీరంలోని ఇన్‌టెక్ మార్గంతో పాటు పైప్‌లైన్, పెండింగ్‌లో ఉన్న ఫిల్టర్‌హౌస్‌ల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. దోమలపెంటకు తాగునీటిని అందించే 3 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌తో పాటు పైప్‌లైన్ పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తాత్కాలిక పద్ధతిలో 30 హెచ్‌పీ మోటార్ల ద్వారా నీటి సరఫరా కొనసాగించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్మోహన్, ఈఈ సుధాకర్‌సింగ్, డీఈ హేమలత తదితరులు ఉన్నారు.

నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు


క్రీడాకారిణులతో కరస్పాండెంట్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కర్ణాటక రాష్ట్రం శ్రీరంగపట్నంలో బుధవారం నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు జరిగే సబ్ జూనియర్ బాలికల నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు నలుగురు జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. బి.వర్ష, లాస్యప్రియ, హాస్యప్రియ, సుదీక్షలు రాష్ట్ర బాలికల జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరిని మంగళవారం జిల్లాకేంద్రంలో మహబూబ్‌నగర్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజేందర్, ప్రిన్సిపల్ శాంత, రజనికాంత్‌రెడ్డి, జియావుద్దీన్, అహ్మద్ హుస్సేన్, కోచ్ ప్రదీప్‌కుమార్ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కుమారులు వేధిస్తున్నారని తల్లిదండ్రుల ఫిర్యాదు


డీఎస్పీకి అందజేసిన ఫిర్యాదు పత్రం


నాగేంద్రం, శాంతమ్మ

కొల్లాపూర్: కుమారులు వేధిస్తున్నారని ఓ వృద్ధ దంపతులు నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల గ్రామానికి చెందిన వృద్ధ దంతపలు ఆరేపల్లి నాగేంద్రం, శాంతమ్మలకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు రాముడు కరీంనగర్‌లో మెకానిక్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. చిన్నకుమారుడు స్వామినాయుడు వనపర్తి జిల్లా పరిధిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కూతురు మహేశ్వరితోపాటు అందరికీ వివాహాలు అయ్యాయి. అయితే నాగేంద్రం దంపతులకు 4 ఎకరాల వ్యవసాయ పొలం, సొంత ఇళ్లు ఉన్నాయి. కూతురు పెళ్లి సమయంలో ఒప్పుకున్న లాంచనాలు ఇవ్వకపోవడంతోపాటు, తాము అనారోగ్యానికి గురైనప్పుడు బాగోగులు చూసినందుకు గాను కూతురు మహేశ్వరికి ఎకరా పొలం పట్టా చేయించారు. ఇది తెలిసిన ఇద్దరు కుమారులు తమను వేధించి మూడు ఎకరాల పొలాన్ని వారి భార్యల పేరిట మార్చుకున్నారని, ఇంటిని కూడా ఇతరులకు అమ్ముకొని తమకు నిలువ నీడ లేకుండా చేశారని ఆరోపించారు. తమ కుమారుల నుంచి రక్షణ కల్పించాలని, తమకు తెలియకుండా అమ్ముకున్న ఇంటిని తిరిగి ఇప్పించాలని మంగళవారం డీఎస్పీని కలిసి ఫిర్యాదు అందజేశారు. ఈ ఫిర్యాదుపై పూర్తిస్థాయి విచారణ చేయాలని కొల్లాపూర్ సీఐ మహేష్‌ను డీఎస్పీ ఆదేశించారు.

బిడ్డా.. మీరెక్కడమ్మా

ఆ ఇద్దరు విద్యార్థినులవీ నిరుపేద కుటుంబాలే.. ఒకరి తండ్రేమో కాళ్ల వాపుతో ఐదేళ్లుగా.. మరొకరి తండ్రి రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయి మూడేళ్లుగా మంచాలకే పరిమితమయ్యారు. దీంతో తాము కష్టపడినా.. తమ పిల్లలైనా బాగుపడాలని భావించిన ఆ తల్లులు కాయాకష్టం చేసి వారిని చదివించుకుంటున్నారు. ఇంతటి కష్టంలోనూ ఆ నిరుపేద కుటుంబాలపై దేవుడు ఏమాత్రం కనికరం లేకుండా మరో పిడుగు వేశాడు. రోడ్డు ప్రమాద రూపంలో ఇద్దరు విద్యార్థినులను కబళించి.. తల్లిదండ్రుల ఆశలను, విద్యార్థినుల కలలను ఛిద్రం చేశాడు.

– గద్వాల క్రైం/ మాగనూర్/ పాన్‌గల్

- చదువు కోసం వెళ్తే అనంత లోకాలకు నర్సింగ్ విద్యార్థినులు
- ఆదుకుంటారనుకున్న వారి కలలను ఛిద్రం చేసిన రోడ్డు ప్రమాదం
- ఇరువురివీ నిరుపేద కుటుంబాలే..
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన తండ్రులు..
- కాయాకష్టం చేసి పోషించుకుంటున్న తల్లులు


మహేశ్వరి ఇంటి దగ్గర అలుముకున్న విషాదం

తీరని గోస..

మాగనూరు మండలంలోని గురువలింగంపల్లి గ్రామానికి చెందిన గోసాయి మారెప్ప, మాణిక్యమ్మల దంపతులకు కుమారుడు రమేష్, గౌరి, మహేశ్వరి ఉన్నారు. అయితే ఐదేళ్ల క్రితం గోసాయి మారెప్ప కాళ్లవాపు వ్యాధితో మచ్చానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కోసం కుమారుడు రమేష్ దినసరి కూలి బాటపట్టగా.. తల్లి మాణిక్యమ్మ స్థానికంగా బిచ్చమెత్తుకుంటూ భర్తను చూసుకుంటుంది. కాగా.. ఇద్దరు కూతుళ్లు కష్టపడి చదివి బీఎస్సీ నర్సింగ్ ప్రభుత్వ సీట్లు సాధించారు. గౌరికి వనపర్తి జిల్లాలో సీటు రాగా, మహేశ్వరి (చివరి అమ్మాయి)కి గద్వాల జిల్లాలో ఉచిత సీటు వచ్చింది. దీంతో మహేశ్వరి గద్వాలలో హాస్టల్‌లో ఉంటూ బీఎస్సీ నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతుంది. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న తన కుటుంబానికి బాసటగా నిలుద్దామని కలలు కన్న ఆ విద్యార్థిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యుఒడికి చేరడంతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. 'బిడ్డా.. నీవెక్కడమ్మా' అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు స్థానికులతో కంటతడి పెట్టించింది. మృతిచెందిన కూతురును కళ్లతో చూద్దామంటే చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రమేష్ (అన్న)ను తీసుకెళ్లారు.

కదిలించిన ప్రమాదం

గద్వాల జిల్లాకేంద్రంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అధికార, రాజకీయ నాయకులను కదిలించింది. ప్రమాదంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు మృతిచెందడంతో బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కుల, విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం రాత్రి జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థినుల కుటుంబాలని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు రోడ్డు ప్రమాదంపై ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ పోలీసులను ఆదేశించారు. మృతిచెందిన విద్యార్థినుల కుటుంబాల వివరాలు, స్థితిగతులపై ఆరా తీయాలని రెవెన్యూ సిబ్బందికిఉ సూచించారు.

మిన్నంటిన రోదనలు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థినుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి బోరున విలపించడంతో ఆస్పత్రి ఆవరణలో రోదనలు మిన్నంటాయి. మనీష మృతదేహంపై తల్లిదండ్రులు బోయ రాజు, శ్రీదేవి పడి గుండెలు అవిసేలా రోదించారు. ఎన్నో ఆశలతో నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ప్రజలకు సేవ చేస్తానని చెప్పిన మాటలు గుర్తు చేసుకొని విలపించారు. త్వరలో వేసవి సెలవులు వస్తాయని, ఇంటికొస్తానని చెప్పిన మాటలను తండ్రి గుర్తు చేసుకొని కంటతడి పెట్టడం పలువురిని కదిలించింది.

తల్లి కష్టమే ఆధారం..


మనీష మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పాన్‌గల్ మండలం రాయినిపల్లి గ్రామానికి చెందిన శ్రీదేవి, రాజుల దంపతులకు కూతురు మనీష, కుమారుడు మనోజుకుమార్ ఉన్నారు. తండ్రి రాజు మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోవడంతో ఎలాంటి పనులు చేయలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ భారమంతా తల్లి శ్రీదేవిపై పడింది. దీంతో ఆమె స్థానికంగా చిన్నపాటి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ.. మనీషశ్రీని నర్సింగ్ చదివిస్తుంది. మరో ఏడాదిలో చదువు పూర్తి చేసుకొని తమ పేద కుటుంబానికి తోడుగా ఉంటుందనుకున్న తరుణంలో కూతురు అకాల మరణం చెందడంతో కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదం విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు అందరూ గద్వాలకు బయలుదేరి వెళ్లారు.

కొనుగోళ్లలో జాప్యం.. రోడ్డెక్కిన అన్నదాతలు


బుద్దారంలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

గోపాల్‌పేట: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జాప్యంపై మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. మండలంలోని బుద్దారం గ్రామంలో మొత్తం నాలుగు కేంద్రాలు ఉండగా ప్రారంభంలో కొన్నిరోజులు మాత్రమే కాంటా చేసి ధాన్యం తరలించారని.. సుమారు వారం రోజులుగా కొనుగోళ్లు జరగడం లేదని రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఆరబెట్టిన ధాన్యం తడిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే లారీలు రప్పించి కొనుగోలు చేసిన ధాన్యం తరలించాలని, కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేష్ కుమార్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి ధాన్యం తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఒక లారీ ధాన్యం తరలించినట్లు గ్రామ రైతులు తెలిపారు.

గోవర్ధనగిరిలో..


గోవర్ధనగిరిలో రాస్తారోకో చేస్తున్న అన్నదాతలు

వీపనగండ్ల: కేంద్రాలకు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మంగళవారం మండలంలోని గోవర్ధనగిరిలో రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో కుప్పల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తాలు, మట్టి పెడ్డలంటూ కోత విధించాలని చూస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరలక్ష్మి అక్కడకు చేరుకొని ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, చిన్న బిచ్చారెడ్డి, పరమేశ్, నర్సింహ, మహేష్, వెంకటేశ్వర్లు, మహబూబ్‌పాషా, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
బుధవారం ॥ 30-4-2025



'వంక'లు లేవు వాగులు లేవు... చెప్పడానికి సాకులు లేవు.
వేసవి సెలవులు వచ్చేశాయి.
సోషల్ మీడియా బందీఖానా నుంచి పిల్లలను ఇప్పుడు రిలీజ్ చేయాలి.
పుస్తకాలకు దగ్గరగా తీసుకురావాలి.
విక్రమార్కుడి సింహాసనం ఎక్కిస్తే కథల దర్బారులోకి వారే ప్రవేశిస్తారు.
వేసవి సెలవుల్లో ఉన్న 50 రోజుల్లో
పిల్లలు పుస్తకాలు ఎందుకు చదవాలి, ఏవి చదవాలి?
వేసవి శీర్షిక 'వేసవి కాలమ్'లో మొదటి కథనం.

సెలవులొచ్చాయి

ఆడించండి... చదివించండి..



పిల్లలకు బడి గంట ఇష్టమే. కాని స్కూల్ మొదలయ్యేప్పుడు కొట్టే గంట కంటే స్కూల్ వదిలేప్పుడు కొట్టే గంట ఎక్కువ ఇష్టం. ఆ గంట విన పడగానే పుస్తకాలు తీసుకుని క్లాస్ నుంచి పరిగెత్తుతారు. కొందరు ప్లేగ్రౌండ్‌కు వెళతారు. కొందరు ఇంటికి చేరి వెంటనే చుట్టుపక్కల ఫ్రెండ్స్‌ను పోగేస్తారు. ఎందుకు? ఇంకెందుకు... ఆటలు ఆడటానికి.

ఇంట్లో నుంచి అమ్మ పిలుస్తున్నా... ఏదైనా తిని వెళ్లమని అరుస్తున్నా పిల్లలు లెక్క చేయరు. ఆడుతుంటారు. ఆడుతూ అరుస్తూ ఉంటారు. నవ్వుతూ ఉంటారు. పేచీ పెడుతూ ఉంటారు. ఓడుతూ ఉంటారు. గెలుస్తూ ఉంటారు. ఇవన్నీ చేస్తూ చెమట చిందిస్తూ ఉంటారు.

పిల్లలూ చెమటా కవలలు.

నేడు... పిల్లలకు చెమటే లేదు. ఎందుకు? ఎందుకంటే వాళ్లు ఆడటం లేదు కాబట్టి. ఆడే బదులు ఓ.టి.టి.లో, కంప్యూటర్లో, సోషల్ మీడియానో తమ బాల్యంతో ఆటలాడుకోవడానికి వీలు కల్పిస్తున్నారు కాబట్టి.

దొంగ... పోలీస్

'దొంగ పోలీస్' ఆట అందరికీ తెలుసు. ఇవాళ దొంగ పోలీస్ ఆట ఎంతమంది పిల్లలకు తెలుసు? ఎంత సింపుల్ ఆట ఇది! ఐదారు మంది పిల్లలు కలిసి పంటలు వేసి గెలుస్తారు. ఆఖరున మిగిలినవాడు పోలీస్ అయ్యి గోడ వైపు తిరిగి వంద లెక్కబెడతాడు. ఈ లోపు పిల్లలు దాక్కుంటారు. ఆ దాక్కున్న వాళ్లను పోలీస్ కనిపెట్టాలి. కనిపెట్టలేకపోతే పోలీస్ ఓడిపోతాడు. ఈ ఆట ఆషామాషీ ఆటనా? పిల్లల మెదడుకు తర్ఫీదు ఇస్తుంది. మున్ముందు జీవితంలో తారసపడబోయే వారిలో ఎవరు దొంగ.. ఎలాంటి దొంగ... వాడి వ్యవహార శైలి ఎలా ఉంటుంది... ఎవరు ఏ మేరకు తప్పించుకోలరు... అదొక్కటేనా? మన వ్యక్తిత్వంలో దొంగ పనులు ఎలా చోటు చేసుకుంటున్నాయి... వాటిని వెతికి పట్టుకొని జైలుకు పంపితే ఎంత మంచి విద్యార్థులం కాగలం... అసలు దొంగలా దాక్కునే బతుకు ఎంత నీచమైనది.... ఇవన్నీ పైకి చెప్పకనే నేర్పిస్తుంది.

ఇవాళ్టి పిల్లలకు కామిక్ హీరో, యూట్యూబ్ గేమర్ తెలుసుకాని దొంగ పోలీస్ తెలీదు. పైగా పిల్లలు ఆ ఆట ఆడుతూ కనిపిస్తే పెద్దలే నవ్వి, జోకులేసి 'మరీ ఈ ఆటలా' అని ఆపించేలా ఉన్నారు.

ఆట లేకుంటే ఆందోళన

పిల్లలు ఆడేందుకు పుట్టారు. ఆడి ఆడి వారు పెద్దవాళ్లవ్వాలి. ఆటకు దూరమయ్యి కాదు. 'పిల్లల చైల్డ్‌హుడ్ యాంగ్జయిటీకి వారు ఆటలకు దూరం కావడమే కారణం' అంటారు జోనాథన్ హైడ్ అనే సోషల్ సైకాలజిస్టు. ఆటకు బదులు టీవీ, కంప్యూటర్, సోషల్ మీడియాకు బానిసైన ఏ పిల్లవాడైనా దృష్టి చెడి, నిద్ర చెడి, కల్మషం నింపే కలకలం రేపే కంటెంట్‌ను చూసి ఆందోళనకు గురవుతాడు. కదలిక లేని మెదలిక లేని కుర్చీలో కూలబడి కేవలం మెదడుకు ఒత్తిడి ఇవ్వడం ద్వారా మెదడుతో పాటు శరీరం కూడా శుష్కమయ్యి మెదడకు తగిన శక్తి ఇవ్వడంలో వెనుకబడుతుంది.

వివాదాల ఇల్లు

అయితే తల్లిదండ్రులు చాలా నియమాలు పెట్టాలని చూస్తారు. టీవీ ఆఫ్ చేస్తారు. రౌటర్ కట్ చేస్తారు. ఓటీటీ రెన్యువల్ చేయరు. ఈ తల్లిదండ్రులే కోవిడ్ కాలంలో ఇవన్నీ అలవాటు చేశారు. ఇప్పుడు వద్దంటే పిల్లలు మానుతారా? ఆటలు ఆడి శ్రమ చేయడానికి ఇష్టపడకపోగా కుర్చీలో కూలబడి పొందే వినోదం కోసం తల్లిదండ్రులతో ఘర్షణ పడుతూ ఉంటారు. దాంతో ఇంట్లో ఆశాంతి నిండిపోతుంది. అందుకే జోనాథన్ హైడ్ ఏమంటారంటే ముందు పిల్లలకు పుస్తకాలు అలవాటు చేయండి. తర్వాత ఆటల్లోకి తీసుకురండి అని.



కట్టెల మోపు కథ

చనిపోయే ముందు ఒక తండ్రి తన నలుగురు కొడుకులకు ఒక్కొక్క కట్టె ఇచ్చి విరవమంటాడు. వాళ్లు విరుస్తారు. ఇప్పుడు నలుగురి చేతుల్లో ఉన్న కట్టెలను మోపుగా కట్టి విరవమంటాడు. కొడుకులు విరవలేకపోతారు. 'కలిసి ఉంటే ఇలా బలంగా ఉంటారు' అని చనిపోతాడు తండ్రి. కొడుకులు ఆ ఐకమత్యాన్ని పాటిస్తారు. కథలు ఎన్నో విషయాలు చెబుతాయి. నేర్పుతాయి. సూక్ష్మబుద్ధిని చూపుతాయి. సమస్యలు ఎదురైతే తెనాలి రామలింగడిలా దొంగల చేతే బావిలోని నీళ్లన్నీ చేదించి పాదులు తడుపుకునే తెలివితేటలను ఇస్తాయి. భారతదేశంలో నుంచి ప్రపంచం కథలను తీసుకుంటే మన పిల్లలకు మనం కథలను దూరం చేస్తున్నాం. పిల్లల నిపుణులు ఏమంటారంటే బొమ్మలున్న కథల పుస్తకాలు చిన్న పిల్లలకు కామిక్స్, గ్రాఫిక్ నవలలు టీనేజర్లకు ఇచ్చి వారికి పుస్తకాలు అలవాటు చేయమని. పుస్తకం చదివిన పిల్లలు ఆ కథను తోటి పిల్లలతో పంచుకోవాలనుకుంటారు. నలుగురు పిల్లలూ కథలు చెప్పుకోవడానికి కూడతారు. ఆ తర్వాత? ఆడుకుంటారు. ఇదీ ఆరోగ్యకరమైన బాల్యం అంటే.

క్లాసులు... స్పెషల్ క్లాసులు...

ఆటల బదులు మార్కులు, సాటి పిల్లలకు బదులు ట్యూషన్ క్లాసులు చుట్టుముట్టి పిల్లలను ఆందోళనలోకి నెడుతున్నాయి. కాలూ చేయీ కదపని దేహం బుద్ధిని ఎలా కదుపుతుంది? ఫిట్‌గా లేని శరీరం ర్యాంకులు ఎలా తెస్తుంది? ఆటలో పడి లేస్తారు పిల్లలు. అది అలవాటైతే చదువులో పడినా లేవడం తెలుసుకుంటారు. లేదా లేవడానికి కథల్లో చదివిన ఒక ఉదాత్త నాయకుడిని తోడు తెచ్చుకుంటారు. ఆటపాటలు లేకపోవడం వల్లే నేడు పిల్లలు ర్యాంకు రాకపోయినా ఫెయిల్ అయినా చాలా దూరం పోతున్నారు.

సెలవులొచ్చాయి.
ఆడించండి. చదివించండి.

– కె.

బ్యూటిప్స్

మూడు టేబుల్ స్పూన్స్ మేర సగ్గు బియ్యం తీసుకోవాలి. అంతకు ముందే వాటిని ఓ కప్పు నీటిలో ఉడకబెట్టాలి. అయితే.. ఫేస్ మాస్క్ తయారీ కోసం వీటిని ఆ నీటితో పాటు వాడాలి. ఈ మాస్క్ లో అన్నం కూడా కలపాలి. రెండు మూడు టేబుల్ స్పూన్స్ అన్నాన్ని తీసుకోవాలి. ఆ తరవాత ఓ టేబుల్ స్పూన్ శనగపిండి, ఓ టేబుల్ స్పూన్ బంక మట్టి, ఓ టేబుల్ స్పూన్ తేనె అందుబాటులో ఉంచుకోవాలి. చివరగా మూడు నుంచి నాలుగు టేబుల్ స్పూన్స్ రోజ్ వాటర్ నీ తీసుకోవాలి. వీటన్నింటినీ ఓ మిక్సీ జార్ లో వేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ లా వేసుకుని ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు లేదా మూడు సార్లు చేస్తూ ఉంటే ముఖం మిలమిలలాడుతుంది.



లీగల్

ష్యూరిటీ ఇచ్చేముందే జాగ్రత్త పడాలి

నా స్నేహితుడు ఒక ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బు తీసుకునేటప్పుడు నేను హామీ (ష్యూరిటీ) ఇచ్చాను. ఇప్పుడు అతను పరారీలో ఉన్నాడు. చిట్‌ఫండ్ వారు నాపై కేసు వేశారు. ఆ మొత్తం నేను కట్టవలసిందేనా?

– రాహుల్, ఖమ్మం

ష్యూరిటీ ఇమ్మని మిమ్మల్ని ఎవరూ బలవంతం చేయలేదు కదా! ష్యూరిటీ ఇచ్చిన తర్వాత మీరు ఎంత మొత్తానికి హామీ ఇచ్చారో అంత మొత్తం మీ వద్ద నుండి వసూలు చేస్తారు. వాయిదా పద్ధతుల్లో చెల్లించవచ్చు. మీ స్నేహితుడికి ఏవైనా ఆస్తులు ఉంటే అవి జప్తు చేయవలసినదిగా కోరవచ్చు. అలాంటివి ఏమైనా ఉన్నాయేమో చూడండి. ష్యూరిటీ ఇచ్చేముందు జాగ్రత్త వహించడం మంచిది. నమ్మకస్తులకి, డబ్బు తిరిగి చెల్లించే స్థితి ఉన్న వారికి మాత్రమే ష్యూరిటీ ఇవ్వడం మంచిది.

నేను ఒక ప్రైవేటు సంస్థలో చిట్టీ కట్టాను. మొత్తం 50 నెలలు కట్టాలి కానీ నా పరిస్థితులు బాగుండక 15 నెలలు మాత్రమే కట్టాను. చిట్టీ ఎత్తలేదు. నేను కట్టిన డబ్బు నాకు తిరిగి రావాలంటే ఏం చేయాలి?

– సుందర్, హైదరాబాద్

చిట్టీ కట్టడాన్ని మధ్యలోనే ఆపేయడం తరచుగానే చూస్తుంటాం. మంచి సంస్థలలో అయితే లిఖితపూర్వక హామీపత్రాలు (అగ్రిమెంట్) ఉంటాయి కాబట్టి, అందులోని ఒప్పందం ప్రకారం కొంత జరిమానా విధించి మీరు అప్పటివరకు కట్టిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తుంటారు. కొన్ని సంస్థలు అయితే చిట్టీ గడువు పూర్తిగా ముగిశాక లేదా మీ బదులు ఇంకెవరైనా మీ గ్రూపు చిట్టీలో కలిస్తే కొంత కమీషన్ తీసుకొని డబ్బు తిరిగి ఇస్తుంటారు. ఏది ఏమైనా, మీరు కట్టినన్ని డబ్బులు మీకు రావు కానీ పూర్తి నష్టం మాత్రం ఉండదు. మీరు చిట్టీ కట్టిన సంస్థని సంప్రదించి క్యాన్సిలేషన్ అడగండి. వారి నిబంధనల మేరకు వారికి రావలసిన మొత్తాన్ని మినహాయించుకుని మిగిలినది ఇస్తారు.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

* జెండర్ ఈక్వాలిటీ

ప్లంబర్లుగా మహిళా శక్తి!

లింగ సమానత్వం కార్పొరేట్ రంగాల్లో కాదు శ్రామిక శక్తిలో చూపాలి అని నిరూపిస్తోంది జోర్డాన్ మహిళ. జోర్డాన్‌లో వందలాది మహిళలు ప్లంబర్లుగా విధులను నిర్వహిస్తున్నారు. మొదట్లో దీనిని అవమానకరంగా భావిస్తూ వీరి పనులపై గతంలో నిషేధం విధించారు. అక్కడి సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా మహిళలు శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఒక సవాల్‌గా ఉంది. ఇప్పుడు ఆ అనిశ్చితి తొలగి, జోర్డాన్‌లో మహిళా ప్లంబర్లపై ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది. 2006లో మొట్టమొదటి లైసెన్స్ పొందిన మహిళా ప్లంబర్ ఖవ్లా షేక్ ఈ పనిలోకి ఎక్కువ మంది మహిళలు వచ్చేలా ప్రోత్సహిస్తుండగా, 2014లో ఏర్పడిన వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ ఈ రంగంలో లింగసమానత్వం సాధించడానికి కృషి చేస్తోంది. జోర్డాన్ సంప్రదాయ కట్టుబాట్ల కంచెను తొలగించుకుంటూ అక్కడి మహిళ తన ఉనికికోసం చేస్తున్న కృషి ప్రపంచం దృష్టిని ఆకట్టుకునేలా చేస్తోంది.

'స్త్రీ ఉద్యోగం చేయకూడదు, అది కుటుంబానికే అవమానం. అటువంటిది మరీ చోద్యం కాకపోతే పురుషులకు దీటుగా చేసే ఆ పనులేంటి..!?' తహానీ అల్ షాతి, యుస్రా మోహమ్మద్ స్మోర్.. వంటి వాళ్లు ప్లంబర్లుగా శిక్షణ ప్రారంభించినప్పుడు ఇలాంటి ఎన్నో మాటలు తమ సాటి వారి నుంచి వచ్చినవే. జోర్డాన్‌లో సామాజిక, సాంస్కృతిక నిబంధనల కారణంగా జీతంతో కూడిన పనిలో మహిళల నిష్పత్తి ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది. శ్రామిక శక్తిలోకి ప్రవేశించడం ఇప్పటికీ చాలామంది మహిళలకు అతిపెద్ద సవాల్.



సమర్థతే సరైన ఔషధం

ప్లంబర్లుగా శిక్షణ తీసుకుంటున్న తొలి రోజులను అల్‌షాతి గుర్తుచేసుకుంది. శిక్షణ తీసుకుంటున్న ఇతర మహిళలు వీధిలో నీళ్లు లీక్ అవుతున్న పైపును చూశారు. లీకేజీని ఆపడానికి తమ వద్ద గల ఉపకరణాలను బయటకు తీశారు. దారిన పోతున్న ఒక మహిళ వారిని చూసి 'మీరేంటి ఈ పనులు చేయడమేంటి?' అని తిట్టడం మొదలుపెట్టింది. దాంతో అక్కడ ఇంకొంతమంది పోగయ్యారు. వాళ్లు కూడా అవే మాటలు.. అవేమీ ఈ శిక్షణ తీసుకుంటున్న బృందం పట్టించుకోలేదు. నీళ్ల లీకేజీని ఆపాలనుకున్న పనిని సమర్థంగా పూర్తిచేశారు. నీటినష్టాన్ని నివారించారు. దీంతో అక్కడున్న వారి నోళ్లు మూతపడ్డాయి. తమలో తాము గొణుక్కుంటూ అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇప్పుడు అక్కడ అల్ షాతి, స్మోర్ లాంటి వందలాది మహిళా సర్టిఫైడ్ ప్లంబర్లు ఉన్నారు.

రాజధాని నగరమైన అమ్మాన్‌లోని ఈ మహిళలంతా 'ఈ అసాధారణ కెరీర్ మా జీవితాలనే మార్చిందని, ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యాన్ని అందించిందని, ఇతర మహిళలకు శిక్షణ ఇస్తూ తమ దేశాన్ని పర్యటించే అవకాశాలను కల్పించిందని' ముక్త కంఠంతో అంటున్నారు. 'నా భర్త, పిల్లలు నన్ను చూసి చాలా గర్వపడుతుంటారు. నా పొరుగువారు నన్ను చూసి అసూయపడుతున్నారు' అని స్మోర్ చెబుతుంది.

భిన్నమైన సేవ

జోర్డాన్‌లో నీటి కొరత పెద్ద సమస్య. ఇందుకు భౌగోళిక, పర్యావరణ పరమైన కారణాలు మొదటివి కాగా, నీటిని దొంగిలించడం అనేది మరో ముఖ్యమైన కారణం.

అందుకే జోర్డాన్‌లో మహిళల కోసం అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా నీటి పొదుపు కోసం రకరకాల ఉపకరణాలను బిగించడంలో మహిళలకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. నీటి వనరుల నిర్వహణలో మహిళలను పాల్గొనేలా చేయడం మంచి నిర్ణయమని నీటి, పారిశుధ్య సలహాదారు హింద్ అల్లెఫాత్ పేర్కొన్నారు. ఎందుకంటే నీటి ప్రాముఖ్యత గురించి వారికే ఎక్కువ తెలుసు. ఈ మేరకు వారు యువత, వృద్ధులలో అవగాహనను తీసుకు రాగలరు. ఈ కోణంలో చూసినపుడు వారు తల్లులే కాదు, టీచర్లు కూడా!

ఆర్థిక భద్రత

అల్ షాతి, స్మోర్ తో సహా కొంతమంది మహిళా ప్లంబర్లు 2014లో వైజ్ ఉమెన్ ప్లంబర్స్ కో ఆపరేటివ్ కార్యక్రమంలో చేరారు. కలిసి పనిచేయడం వల్ల భద్రత, ఆర్థిక స్థిరత్వం, అలాగే పెద్ద ప్రాజెక్టులను లీడ్ చేసే అవకాశాలు లభిస్తాయనేది వీరి ఆలోచన. ఇందులోని సభ్యులు తమ చుట్టుపక్కల ఇళ్లకు వెళ్లి ఉచిత సర్వీస్ అందిస్తున్నారు.

మొదటిసారి 2004లో 15 మంది మహిళలతో కలిసి శిక్షణ తీసుకున్నప్పుడు 'సంస్కృతికే అవమానం' అనే కారణంగా ఇతరులెవరూ దానిని ఆమోదించలేదు. కానీ, ''నేడు ఈ పని రాని వారు కూడా సాధారణ మరమ్మతులు చేయడం నేర్చుకుంటే ఇండ్లలో తమ ప్లంబర్ పనిని తామే చేసుకోవచ్చు' అని వివరిస్తూ తోటి మహిళలనూ ప్రోత్సహిస్తున్నారు. ఇలా ప్లంబర్ పనిచేసే ఈ మహిళలంతా చాలా కాలంగా తమ సమాజంలోని నిబంధనలను సవాల్ చేస్తూ తమ ఉనికిని చాటుతున్నారు. లింగ సమానత్వాన్ని కాపాడుకున్నారు.



● పర్యావరణ హిత

ఈ చిత్రాన్ని మీకు సమర్పిస్తున్న వారు...

నోరు లేని మూగజీవాలు, విలువైన ప్రకృతి గురించి చెప్పడానికి ఎన్నో కథలు ఉన్నాయి. వాటికి చిత్రరూపం ఇవ్వడానికి, మహిళలలోని సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, వారిని డైరెక్టర్‌లుగా తీర్చిదిద్దడానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' అనే స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది.

కోల్‌కత్తాకు చెందిన అశ్వికాకపూర్ బీబీసి నేచురల్ హిస్టరీ యూనిట్ డైరెక్టర్. పశ్చిమబెంగాల్ అడవుల్లో 'వణ్యప్రాణుల వేట' పేరుతో ఉత్సవాలు చేస్తారు, ఇందులో పిల్లలు కూడా పాల్గొంటారు. దీనిపై ఆమె 'క్యాటపల్ట్స్ టు కెమెరాస్' చిత్రాన్ని తీసింది. ఈ చిత్రం న్యూయార్క్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ స్ఫూర్తిదాయక చిత్రంగా అవార్డు గెలుచుకుంది.

అశ్వికాలాంటి ఎంతోమంది మహిళా దర్శకుల విజయానికి 'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' దారి చూపింది.



'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ద్వారా వణ్యప్రాణుల గురించి వీలైనంత ఎక్కువగా తెలుసుకునే అవకాశం వచ్చింది. ఎప్పుడూ వినని అరుదైన జీవులు గురించి కూడా తెలుసుకున్నాను. వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్‌గా ఇది నాకు ఎంతో ఉపయోగపడుతుంది' అంటుంది అశ్వికాకపూర్.

పిల్లల జీవితాలను మార్చింది

వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రఫీ, చిత్రాల ద్వారా వేటకు వెళ్లే పిల్లల మనస్తత్వాలను మార్చాం. ఇప్పుడు వారు అడవి జంతువులను 'వేట కోసం' అన్నట్లుగా చూడడం లేదు. సంరక్షించుకోవాల్సిన అందమైన జీవులుగా చూస్తున్నారు. మా చిత్రనిర్మాణ ప్రక్రియ వన్యప్రాణులను కాపాడడమే కాదు పిల్లల జీవితాలను కూడా మార్చింది. తమ చుట్టూ ఉన్న సహజ ప్రపంచంతో కనెక్ట్ కావడానికి వారికి ఇది కొత్త మార్గాన్ని చూపించింది.

– నేహా దీక్షిత్, ఫిల్మ్‌మేకర్

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' సంస్థను సియాటిల్‌కు చెందిన పారిశ్రామికవేత్త, దాత గుర్‌ప్రీత్ సన్నీసింగ్ స్థాపించారు. వణ్యప్రాణులపై విలువైన కథలు వెండితెరపై చెప్పడానికి వీలుగా ఇది మహిళా కథకులకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్ దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ఫిల్మ్‌మేకర్స్‌తో కలిసి పనిచేస్తోంది. ఫండింగ్ నుంచి దర్శకులకు మార్గనిర్దేశం చేయడం వరకు రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఎన్నో చేస్తుంది' అంటుంది రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ ఫిల్మ్స్' క్రియేటివ్ డైరెక్టర్, ఫిల్మ్‌మేకర్ సమ్రీన్ ఫారూఖీ.

'రౌండ్‌గ్లాస్ సస్టెయిన్' నిర్మాణ సంస్థ తన వెబ్‌సైట్ ద్వారా సినిమాలను విడుదల చేస్తుంది.

వారే నిజమై హీరోలు

భూగోళ సంక్షోభం గురించి నిరాశపడడం కంటే కార్యాచరణ అనేది ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సంరక్షకులు, శాస్త్రవేత్తలు, రేంజర్ల రూపంలో ఆశ కనిపిస్తుంది. వారు నిజమైన హీరోలు. ఈ హీరోలు మన భూగోళాన్ని సురక్షితంగా ఉంచడానికి అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. వారి అంకితభావం మన ఆశావాదానికి బలాన్ని ఇస్తుంది. ఆ ఆశావాదాన్ని దశదిశలా వ్యాప్తి చేయడం ఫిల్మ్‌మేకర్‌గా నా బాధ్యత.

– అశ్వికా కపూర్, ఫిల్మ్‌మేకర్

సినిమాలను ప్రమోట్ చేయడానికి టీమ్ విస్తృతంగా మార్కెటింగ్ కూడా చేస్తుంది. దేశవ్యాప్తంగా పలు భాషల్లో ఆన్‌లైన్ స్క్రీనింగ్‌లు నిర్వహిస్తారు.



'విస్మరించబడిన కథలను వెలుగులోకి తీసుకురావాలనుకుంటుంది. పెద్దగా ఎవరికీ తెలియని ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థలు, జాతులకు ప్రాధాన్యత ఇస్తోంది. దీనికి తోడు లోకల్ ఫిల్మ్‌మేకర్స్‌పై దృష్టి పెట్టింది. సహజ ప్రపంచం గురించి మాట్లాడడానికి మల్టీ మీడియా విధానాన్ని ఉపయోగిస్తోంది. ఫోటో స్టోరీలు, ఇన్ఫోగ్రాఫిక్స్, వ్యాసాలు, కార్టూన్లు ఇందులో ఉంటాయి. కథలను సంచలనం కోసం చెప్పాలనుకోవడం లేదు. స్పష్టంగా చెప్పాలనుకుంటుంది' అని రౌండ్‌గ్లాస్ సస్టెయిన్ గురించి చెబుతోంది సమ్రీన్.

ఇంటిప్స్

కిచెన్ నైఫ్ పదును పోయిందా...

అప్పుడప్పుడు వంటగది చాకులు పదును లేకుండా కూరగాయలు కోయడానికి విసిగిస్తూ ఉంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు చిన్న చిట్కాలున్నాయి.

- పదును పెట్టే రాయి.. పదును పెట్టే రాయిని ఒక్కసారి కొనేసుకుంటే అది ఎప్పటికీ పనిచేస్తుంది. కత్తులు, చాకులు ఇలా వేటినైనా ఈజీగా పదును పెట్టొచ్చు. మనీ సేవ్ చేయడమే కాదు. సమయం కూడా వృథా కాదు.
- నైఫ్ షార్ప్‌నర్.. ఎలక్ట్రిక్, మాన్యువల్ కత్తి షార్ప్‌నర్లు సౌకర్యవంతంగా ఉంటాయి. మరీ ఎక్కువ పదును లేకుండా చూసుకుంటూ పదును పెట్టాలి.
- చాకుల్ని పొడిగా ఉంచాలి.. తేమ తుప్పు పట్టేలా చేస్తుంది. కూరగాయలు కోయడం అయిపోయాకా కత్తుల్ని కాగితం, తువ్వాళ్లలో కట్టి ఆరనీయాలి.
- చాపింగ్ బోర్డ్.. గాజు, గ్రానైట్ లేదా సిరామిక్ ప్లేట్లలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను కట్ చేయడం వల్ల చాకులు ఇట్టే పదును పోతాయి. ఈ పదును ఎక్కువ కాలం ఉండాలంటే చెక్క వస్తువు మీదనే కట్ చేసేలా చూడాలి.
- కటింగ్ టెక్నిక్.. చాకు మీద ఒత్తిడి తగ్గించి సరైన కటింగ్ మెథడ్స్ పాటిస్తూ కట్ చేయడం వల్ల పదును తగ్గే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

